

నేడు ఎంఎస్‌ఎంఈపై అవగాహన సదస్సు

పార్వతీపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల మేధో సంపత్తి హక్కులపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల అధికారి ఎంవీ కరుణాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు. ప్రపంచ బ్యాంకు ప్రాజెక్టు ఆర్‌ఏఎంపీ పథకం కింద నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎంఎస్‌ఎంఈ, జిల్లా ఇండస్ట్రీస్ మేథో సంపత్తి హక్కుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

డోలీ రహిత జిల్లాగా మారుస్తాం

- కందుల సాగుకు ప్రోత్సాహం
- వెయ్యి ఎకరాల్లో నిమ్మగడ్డి సాగు
- తలసరి ఆదాయం పెంపునకు చర్యలు
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



కలెక్టర్లతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, చిత్రంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు

పార్వతీపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాను డోలీ రహిత జిల్లాగా మార్చేందుకు ప్రణాళిక ప్రకారం పనిచేస్తున్నామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివరించారు. రాష్ట్ర సచివాలయంలో రెండో రోజు బుధవారం జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు, వివిధ సమస్యలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. 'జిల్లాలో గిరిజనులు ఎక్కువగా ఉన్నారు. కొండ ప్రాంతాల్లో రహదారుల సదుపాయం లేక డోలీలు ఉపయోగిస్తున్నారు. ఆ పరిస్థితిని మార్చేందుకు కృషి చేస్తున్నాం. అన్ని గిరిజన గ్రామాలకు రహదారి సదుపాయం కల్పించేలా పనిచేస్తున్నాం. 250 మంది జనాభా ఉన్న గ్రామాలకు కూడా రహదారి సదుపాయం కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించాం. అరకు కాఫీకి బ్రాండ్ ఇమేజ్ వచ్చింది. అదే మాదిరిగా మన్యం ప్రాంతంలో జీడిపప్పు సాగును ప్రోత్సహించి, దానికి కూడా బ్రాండ్ ఇమేజ్ వచ్చేలా చేస్తాం. అపరాల సాగును ప్రోత్సహిస్తున్నాం. జిల్లాలో ఎమేమియా ఎక్కువగా ఉంది. దానిని కూడా తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నాం. కంటైనర్లలో హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం జిల్లా తలసరి ఆదాయం రూ.1.67 లక్షలుగా ఉంది. ఇది వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి రూ.1.94 లక్షలకు పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా ప్రగతికి పర్యాటకం ఎంతో దోహదపడు తుంది. ఈ రంగంలో జిల్లాను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు రూపొందించాం. జిల్లాలో గిరిజన ఇంజనీరింగ్ కళాశాల నిర్మాణ పనులు 60 శాతం పూర్తయ్యాయి. పశుసంవర్థకశాఖ, మత్స్య పరి శ్రమలు, పర్యాటకం, రైల్వే, రవాణా, కమ్యూనికేషన్, నిర్మాణ రంగాల ద్వారా జిల్లాకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నాం. విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. కందుల సాగుకు రైతులను ప్రోత్సహిస్తాం. వెయ్యి ఎకరాల్లో నిమ్మగడ్డి సాగు జరిగేలా చూస్తున్నాం. పల్లెనిద్ర కార్యక్రమం ద్వారా ప్రభుత్వ వసతి గృహాల్లోని సమస్యలను పరిష్కరిస్తున్నాం.' అని కలెక్టర్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌తో చర్చించి అన్ని విధాల జిల్లాను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీఎంకు వివరించారు.

16.90 శాతం వృద్ధిరేటుపై ప్రశంసలు

పార్వతీపురం మన్యం జిల్లా 16.90 శాతం వృద్ధిరేటు సాధించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను ప్రశంసించారు. పీపీపీ పర్సెప్షన్‌లో జిల్లా నాలుగో ర్యాంకులో ఉండడంపై అభినందించారు. ఈ జిల్లాను అన్ని జిల్లాలు ఆదర్శంగా తీసుకోవాలని ముఖ్యమంత్రి తెలిపారు. జిల్లా లో ఏనుగుల సమస్య ఉందని, శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ కోరారు. కురుపాంలో గిరిజన ఇంజనీరింగ్ కళాశాల పనులు 60 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులు కావాల్సి ఉందన్నారు. లాబేసు, పూర్ణపాడు వంతెన పనులు పూర్తి చేయాల్సి ఉందని, తద్వారా 19 గ్రామాలకు రహదారి సౌకర్యం లభిస్తుందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకురాగా..తక్షణ చర్యలకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 50 శాతం వ్యవసాయ రంగం నుంచి, 9 శాతం పారి శ్రామిక రంగం, 42 శాతం సేవా రంగం నుంచి జీడీపీ వస్తుందని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పది సూత్రాలు కచ్చితంగా అమలు చేస్తూ, మరింత వృద్ధి సాధించడానికి చర్యలు చేపడతామని సీఎంకు వివరించారు.

వివిధ అంశాలపై నివేదిక..

జిల్లాకు అవసరమైన అభివృద్ధి పనులు, తదితర అంశాలపై కలెక్టర్ ప్రభుత్వానికి నివేదిక అందించారు. 91 గ్రామాలకు పీఎంజీఎస్‌వై ద్వారా రహదారులు నిర్మించేందుకు డీఆర్‌పీని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖకు పంపించినట్టు చెప్పారు. దీనికి సంబంధించి అవసరమైన ఆదేశాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు ఎంతో అవసరమని, ఇది గిరిజన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని నివేదికలో పేర్కొన్నారు.

బిల్లు కావాలా.. లంచం ఇవ్వు

- రూ.60వేలు డిమాండ్ చేసిన జిల్లా మత్స్యశాఖ అధికారి
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- దాడిచేసి పట్టుకున్న అధికారులు

పార్వతీపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా మత్స్యశాఖ అధికారి వేముల తిరుపతయ్య బుధవారం అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కారు. చేప పిల్లల బిల్లు చెల్లించేందుకు గాను బాధితుడి నుంచి రూ.60 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు దాడిచేసి పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ బీవీఎస్‌ఎస్ రమణమూర్తి వివరాల మేరకు.. పాలకొండ మండలం టీడీ పారాపురానికి చెందిన కోటదుర్గ గిరిజన ఫిష్ సీడ్ సంస్థ యజమాని బొప్పన అప్పన్నదొర పార్వతీపు రం, సీతంపేట ఐటీడీఏల పరిధిలోని గిరిజన మత్స్యకారులకు, అదే విధంగా జిల్లాలోని చెరువులకు చేప పిల్లలను సరఫరా చేశారు. దీనికి సంబంధించి ఆయనకు రూ.60 లక్షలు బిల్లులు చెల్లించాల్సి ఉంది. అయితే, పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించాలంటే రూ.60 వేలు లంచం ఇవ్వాలని జిల్లా మత్స్యశాఖ అధికారి తిరుపతయ్య డిమాండ్ చేశారు. దీంతో అప్పన్నదొర ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచ నల మేరకు బుధవారం మధ్యాహ్నం రూ.60వేలు తీసుకెళ్లి తిరుప తయ్యకు అందజేశాడు. ఆ డబ్బులను తిరుపతయ్య తన టేబుల్ డ్రాయర్‌లో పెడుతుండగా విజయనగరం, శ్రీకాకుళం ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో సీఐలు మహేశ్వరరావు, భాస్కరరావు, ఎస్‌ఐ వాసునారాయణ, సిబ్బంది దాడి చేసి పట్టుకున్నారు. తిరుపతయ్యను గురువారం విశాఖలోని ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ చెప్పారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ అధికారులకు సమాచారం అందించాలని అన్నారు.



లంచం సొమ్ముతో ఏసీబీ అధికారులకు చిక్కిన జిల్లా మత్స్యశాఖ అధికారి తిరుపతయ్య



వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి

మారని అధికారుల తీరు

జిల్లాలో కొంతమంది అధికారులు ప్రభుత్వం నుంచి లక్షలాది రూపాయల వేతనం తీసుకుంటున్నారు. అయినా పనులు చేసేందుకు లంచాలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కుతున్నారు. గతంలో ఐటీడీఏ పరిధిలో మత్స్యశాఖలో పనిచేసిన మురళీ అనే అధికారి మత్స్యకారుల నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. అదే విధంగా గతంలో పనిచేసిన సాలూరు మునిసిపల్ కమిషనర్, నగర పంచాయతీ కమిషనర్ కూడా లంచం తీసుకుంటుండగా ఏసీబీకి దొరికిపోయారు. ఒక పక్క లంచాలు, మరోపక్క పనుల్లో పర్సంటేజీలు దండుకుంటూ కొంతమంది అధికారులు రెండుచేతులా సంపాదిస్తున్నా రు. ఇటువంటి వారి పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రోత్సహిస్తే ప్రయోజనం

- ఏజెన్సీలో పెద్దఎత్తున వనమూలికలు లభ్యం
- సేకరణపై గిరిజనులకు కొరవడిన అవగాహన
- నేలపాలవుతున్న విలువైన అటవీ సంపద
- జీసీసీ ద్వారా కొనుగోలు చేస్తే మంచి ఫలితాలు



కురుపాం మండలం జరడా వద్ద విలువైన వనమూలికలు దొరికే చీకటి కొండ ప్రాంతం

గుమ్మలక్ష్మీపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతం వనమూలికలకు పెట్టింది పేరు. ఇక్కడ ఎన్నో రకాల వనమూలికలు లభ్యమవుతుంటాయి. అయితే, వీటి సేకరణపై గిరిజనులకు అవగాహన లేకపోవడంతో విలువైన వనమూలికలు నేలపాలవుతున్నాయి. వనమూలికలను సేకరించేలా గిరిజనులను ప్రోత్సహించడంతో పాటు జీసీసీ ద్వారా వాటిని కొనుగోలు చేస్తే ఎంతో ప్రయోజనం కలగనుంది. జిల్లాలోని సీతంపేట, దోనుబాయి, గుమ్మలక్ష్మీపురం, కురుపాం, కొమరాడ, మక్కువ, పాచిపెంట ప్రాంతాల్లో దట్టమైన అడవులు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో అటవీ ఫలసాయాలతో పాటుగా పెద్ద ఎత్తున వనమూలికలు కూడా ప్రకృతి సిద్ధంగా లభిస్తుంటాయి. ఈ ప్రాంతాల్లో నివసిస్తున్న సవర, జాతాపు తెగ గిరిజనులు వారి జీవనోపాధి కోసం చింతపండు, కొండ చీపుర్లు, కరక్కాయలు, నరమామిడి చెక్క, నల్లజీడి పిక్కలు తదితర అటవీ ఫలసాయాలు సేకరిస్తుంటారు. వీటితో పాటు ఈ ప్రాంతాల్లో నేలవేము, పాతాళగిరడ, సరస్వతి ఆకు, గులివెంద గింజలు, ఇండుగ పిక్కలు, గుగ్గిలం, అశ్వగంధి తదితర 40 రకాల వనమూలికలు అభ్యమవుతున్నాయి. కానీ, వీటి సేకరణపై గిరిజనులు ఆసక్తి చూపడం లేదు. గతంలో గిరిజన సహకార సంస్థ (జీసీసీ) మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేసిన టి.విజయకుమార్ వనమూలికల సేకరణపై దృష్టి సారించారు. ఏయే రకాల వనమూలికలు దొరుకుతున్నాయో సర్వే కూడా చేశారు. హెర్బేనియం ప్రిపేర్ చేశారు. ఆయన హయాంలో జీసీసీ ద్వారా వనమూలికలు కొనుగోలు చేసేవారు. వాటిని జండు, డాబర్, హిమాలయ తదితర ఆయుర్వేద ఔషధాలు తయారు చేసే సంస్థలకు అమ్మేవారు. ఆయన బదిలీ తర్వాత వచ్చిన (మిగతా 8వ పేజీలో..)

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

పార్వతీపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన సబ్‌ప్లాన్ ప్రాంతాల్లో అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి టి.కనకదుర్గ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్వతీపురం, సీతంపేట సబ్‌ప్లాన్ ఏరియాల్లో 9 అంగన్‌వాడీ కార్యకర్తలు, 13 హెల్పర్లు, 12 మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. పార్వతీపురం డివిజన్‌కు సంబంధించి వీఆర్‌పేటలో అంగన్‌వాడీ కార్యకర్త 1, సహాయకులు 1, మినీ అంగన్‌వాడీ కార్యకర్త 1, కొమరాడలో మినీ అంగన్‌వాడీ కార్యకర్త 2, సాలూరులో వర్కర్ 2, సహాయకులు 2, మినీ కార్యకర్త 2, పాచిపెంటలో అంగన్‌వాడీ వర్కర్ 1, సహాయకులు 5, మినీ కార్యకర్త 5, మక్కువలో అంగన్‌వాడీ వర్కర్ 3, పాలకొండ డివిజన్‌కు సంబంధించి కురుపాంలో అంగ్‌వాడీ కార్యకర్త 1, సహాయకులు 1, జీఎంవలసలో సహాయకులు 2, భద్రగిరి, గుమ్మలక్ష్మీపురంలో వర్కర్ 1, సహాయకులు 2 మొత్తం 34 ఖాళీలు భర్తీ చేయడానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఏప్రిల్ 4వ తేదీలోగా సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

బీమా నమోదుకు గడువు పెంపు

పార్వతీపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలకు గురైన కార్మికులు బీమా పొందడానికి తమ పేర్లను ఈ-శ్రమ పోర్టల్‌లో నమోదు చేసుకోవడానికి ఈ నెల 31వరకు గడువు పొడిగించినట్లు జిల్లా కార్మిక శాఖాధికారి జి.ఎల్లాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2021 ఆగస్టు 26 నుంచి 2022 మార్చి వరకు ప్రమాదాలకు గురైన వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94925 55023 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కళలకు జీవం పోస్తూ..

- రంగస్థలంపై రాణిస్తున్న ఉమ్మడి జిల్లాల కళాకారులు
- నాటక రంగ వైభవానికి కృషి
- నేడు ప్రపంచ నాటక దినోత్సవం

6లో

ఇక్కడి అమ్మాయి.. అక్కడ అందాల రాశి

- అమెరికా తెలుగు అందాల భామల పోటీలో ఫైనల్‌కు సాయిసాత్విక
- ఆమె స్వస్థలం తెర్లాం మండలం సోమిదవలస

6లో



ఇంకా ఎన్నాళ్లు?

- ప్రభుత్వ కార్యాలయాలకు సొంత గూడు కరువు
- అద్దె భవనాల్లో నడుస్తున్న వైనం
- వసతులు లేక ఉద్యోగుల ఇబ్బందులు



జిల్లా మలేరియా కార్యాలయం ఇలా..



పార్వతీపురంలో ఇరుకు గదిలో నిర్వహిస్తున్న ఏపీ ఎంఐపీ కార్యాలయం

పార్వతీపురం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కరువయ్యాయి. జిల్లా ఏర్పడి మూడేళ్లు పూర్తవుతున్నప్పటికీ ఇప్పటికీ అత్యధిక ప్రభుత్వ కార్యాలయాలు ప్రైవేటు భవనాల్లో నడుస్తున్నాయి. ఈ భవనాలకు వేలాది రూపాయలు అద్దెలు చెల్లిస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు లేక అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లా మలేరియా, పంచాయతీ, సబ్‌ట్రెజరీ, సాంఘిక సంక్షేమశాఖ తదితర కార్యాలయాలకు శాశ్వత భవనాలు కరువయ్యాయి. వాటిని ఇరుకైన గదుల్లో నిర్వహిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం హడావుడిగా కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. అయితే, కనీసం ప్రభుత్వ కార్యాలయాలకు సొంతగూడును కల్పించలేకపోయింది. ఇరుకైన గదుల్లో వాటిని ఏర్పాటు చేసింది. ఏడాదిపాటే అద్దె భవనాలు ఉంటాయని, త్వరలోనే ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి సొంత భవనం ఉంటుందని అప్పట్లో కొంతమంది అధికారులు, పాలకులు గొప్పలు చెప్పారు. కానీ, నేటికీ అది కార్యరూపం దాల్చలేదు. విద్యార్థుల వసతి గృహాలు వలే ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. వాటికి అనుసంధానంగా మరుగుదొడ్లు, తాగునీరు తదితర మౌలిక వసతులు లేక ఉద్యోగులు, సిబ్బంది అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొందరు అధికారులు తమ కార్యాలయాలను అన్ని మౌలిక వసతులు ఉన్న ప్రైవేటు భవనాలకు తరలిస్తున్నారు. వీటికి రూ.వేలల్లో అద్దె చెల్లిస్తున్నారు. తాము సర్వీస్‌లో ఉంటుండగా తమ శాఖలకు సొంత భవనాలను చూస్తామా? లేదా? అన్న సందేహం ఉందని కొంతమంది ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్న పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని కోరుతున్నారు.

కళలకు జీవం పోస్తూ..

కళలు.. కళాకారులకు నిలయమైన విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు ఎంతో మంది నటులను నాటక రంగానికి అందించాయి. వీరిలో సినిమాల్లో రాణించిన వారు... ప్రస్తుతం చిత్రసీమలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న వారు ఎందరో ఉన్నారు. వివిధ నాటికల్లో విభిన్న పాత్రలతో గుర్తింపు తెచ్చుకున్న నటులు ఎందరో ఉన్నారు. కొన్నాళ్ల పాటు నాటక రంగానికి ఆదరణ తగ్గినప్పటికీ..ఇటీవల కాలంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నాటిక పోటీలు నిర్వహిస్తూ... కళాకారులను ప్రోత్సహించడంతో నాటక రంగం పూర్వవైభవం సంతరించుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

● రంగస్థలంపై రాణిస్తున్న ఉమ్మడి జిల్లాల కళాకారులు ● నాటక రంగ వైభవానికి కృషి ● నేడు ప్రపంచ నాటక దినోత్సవం





బహుమతులతో రావాడ సత్యనారాయణ

రచయితగా... నటుడిగా 'రావాడ' ప్రతిభ

బొబ్బిలి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): గజపతినగరం ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న డాక్టర్ రావాడ సత్యనారాయణ బొబ్బిలి గాంధీబొమ్మ సెంటరులో నివాసముంటున్నారు. ఆయనకు సుమారు అర్ధ శతాబ్ద కాలపు నాటకానుభవం ఉంది. నాటకాలు రాయడం ఆయన అభిరుచి. ఆ క్రమంలోనే రంగస్థలంపై అడుగు పెట్టారు. 1976లో 'అడది' అనే నాటికతో ఆయన నాటక రంగంలోకి ప్రవేశించారు. ఆ తరువాత భజంత్రీలు, ఆరని జ్వాల, ఒక దీపం వెలిగింది, అరణ్యపర్వం, నరమేథం, వెలుగుపూలు, సముద్రం అన్నాక కెరటాలుంటాయి, కొక్కొరోకో, కన్యాశుల్కం, చైత్రంలో శిశిరం వంటి నాటికలలో వివిధ పాత్రలు పోషించారు. తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా ఒడిశా, మధ్యప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్ వంటి రాష్ట్రాలలోనూ నాటికలను ప్రదర్శించి మన్ననలు అందుకున్నారు. 2004 నంది నాటకోత్సవంలో డాక్టర్ రావాడ రాసిన 'సముద్రం అన్నాక కెరటాలుంటాయి' అనే నాటకానికి ఆయన నంది అవార్డును గెలుచుకున్నారు. ఎనిమిదిన్నర గంటల పాటు సాగే 'కన్యాశుల్కం' నాటకంలో రామప్పపంతులు పాత్రతో రావాడా ఆకట్టుకున్నారు. చైత్రంలో శిశిరం, వెలుగుపూలు, నిర్మాల్యం, సముద్రం అన్నాక కెరటాలుంటాయ్, ధర్మవడ్డీ, లక్షా... గోవిందా.., ఆసరా తదితర నాటికలు, నాటకాలను ఆయన రచించారు. బాల కార్మికుల వ్యవస్థ ఇతివృత్తంగా రాసిన 'చైత్రంలో శిశిరం' అనే నాటకం హిందీలోనికి అనువదితమైంది. వాల్మీకి జీవిత గాథ ఆధారంగా నిర్మాల్యం అనే నాటికను రాశారు. దీనిని నాగార్జున యూనివర్సిటీకి చెందిన పీహెచ్‌డీ విద్యార్థి పరిశోధనాంశంగా ఎంచుకోవడం గమనార్హం. ఆణిముత్యాలు అనే సీరియల్‌లో కూడా నటించారు. అమెరికాకు చెందిన అజో-విభో ఫౌండేషన్‌తో పాటు తనికెళ్ల భరణి, రాళ్లపల్లి వంటి ప్రముఖ కళాకారులు, సాహితీవేత్తల ప్రశంసలను అందుకున్నారు. కాలం ఎంత మారినా కళలకు ఆదరణ తగ్గదని ఆయన అభిప్రాయపడ్డారు. సినిమాల్లో నటించేందుకు అవకాశం తనకు వచ్చినప్పటికీ సద్వినియోగం చేసుకునే అవకాశం దొరకలేదని అన్నారు.

నాటకంపై 'రౌతు' ముద్ర

జియ్యమ్మవలస, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జియ్యమ్మవలస మండలం పెదమేరంగి గ్రామానికి చెందిన రౌతు వాసుదేవరావు మాస్టారు నటుడిగా.. దర్శకునిగా... రాణిస్తున్నారు. వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన ఆయన ఉద్యోగ విరమణ తరువాత పూర్తి స్థాయిలో నాటక రంగానికి సేవలందిస్తున్నారు. కళాకారులనూ ప్రోత్సహిస్తున్నారు. 1978 సెప్టెంబరులో ప్రజా వాగ్గేయకారుడు, దివంగత వంగపండు ప్రసాదరావు రచించిన 'భూమి భాగోతం' నృత్య నాటకానికి దర్శకత్వం వహించడంతో పాటు ఆ నాటకంలో కరణం పాత్రలో నటించి రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల్లో రెండు వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. 'తూర్పు రేఖలు' నాటికలో నకిలీ పోలీసు పాత్రకు జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు పొందారు. 2012లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించిన నంది నాటక పోటీల్లో ప్రదర్శించిన ఈ నాటకానికి రెండు నంది అవార్డులు వరించాయి. అంతేకాకుండా జాతీయ ఉత్తమ హాస్య నటుడిగా బహుమతి పొందారు. 2016లో జరిగిన నంది నాటక పోటీలో ఆయన దర్శకత్వం వహించిన 'మడిసక్క' నాటకానికి మూడు నంది అవార్డులు వచ్చాయి. వంగపండు ప్రసాదరావు రచించిన ఎరువుల భాగోతం నాటకానికి దర్శకత్వం వహించారు. కన్యాశుల్కం 8 గంటల నాటకంలోనూ నటించి.. గుర్తింపు సంపాదించారు. అటవీ హక్కుల చట్టంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన 'అడవి తల్లి' (అవగాహన చిత్రం)కి కథ, మాటలు, పాటలు అందించడంతో పాటు ఒక ముఖ్యమైన పాత్రలో నటించారు. దూరదర్శన్‌లో ప్రసారమైన కాటమరాజు కథలు సీరియల్‌లో రాజపురోహితునిగా, సామంత రాజుగా నటించారు. ఓవైపు రంగస్థలంపై రాణిస్తూనే...మరోవైపు వివిధ లఘు చిత్రాలలోనూ నటిసున్నారు.



భూమి భాగోతంలో ఒక సన్నివేశం

జానపద కళలను బతికించండి..

జానపద కళలకు ప్రత్యేక స్థానం ఉండేది. ఎన్నో చట్టాలకు, సంఘ సంస్కరణలకు ఇవి మూల స్తంభాలుగా నిలిచాయి. అటువంటి జానపద కళలు ఇప్పుడు కనుమరుగైపోతున్నాయి. వాటిని బతికించడానికి ప్రతి ఒక్కరూ పూర్తి సహకారం అందించాలి. తద్వారా మరెన్నో సంస్కరణలకు జీవం పోయాలని కోరుతున్నా.

-ఆర్.వాసుదేవరావు, రిటైర్డ్ టీచర్, పెదమేరంగి

హరిశ్చంద్రుడిగా గుర్తింపు..

గరుగుబిల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రావివలసకు చెందిన గంట సీతారామనాయుడు హరిశ్చంద్ర నాటకంతో గుర్తింపు పొందారు. 35 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ఆయన సత్యహరిశ్చంద్రుడు, విశ్వామిత్రుడు, చింతామణిలో చిత్రాంగదుడు, రామాంజనేయ యుద్ధంలో యయాతి తదితర పాత్రలను పోషించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సమస్యల నడుమ నాటక రంగం ఉందని అన్నారు. గతంలో నాటక రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఉండేదని గుర్తు చేసుకున్నారు. ప్రస్తుతం టీవీలు, సినిమాలు రావడంతో నాటక రంగానికి కష్టాలు ఎదురయ్యాయని తెలిపారు. ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పౌరాణిక నాటకాలు వేశామన్నారు. నటుడిగానే కాకుండా సంగీత దర్శకుడిగానూ ఆయన రాణించారు. విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు అనేక ప్రాంతాల్లో పౌరాణిక నాటకాలు ప్రదర్శించామని తెలిపారు. తన ప్రతిభతో అనేక బహుమతులు అందుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 2న విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో తెలుగు, వెలుగు నంది పురస్కారాల అవార్డును సొంతం చేసుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి అభినందనలు అందుకున్నారు.



రాష్ట్ర స్థాయి నంది పురస్కారాన్ని అందుకుంటున్న దృశ్యం (ఫైల్)

ఆబాల'గోపాలం' మెచ్చేలా..

● జిల్లాకు వన్నెతెచ్చిన యడ్ల గోపాలం
● నక్షత్రక పాత్రతో ప్రత్యేక గుర్తింపు
● కళారంగానికి సేవలకు 'పద్మశ్రీ' పురస్కారం

రాజాం/సంతకవిటి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): యడ్ల గోపాలరావు.. పరిచయం అక్కర్లేని పేరు ఇది. తెలుగు నాట పౌరాణిక నాటక రంగంలో ప్రత్యేక పాత్ర ఆయనది. అభిమానులు ఆయనను గోపాలంగా పిలుచుకుంటారు. 'పద్మశ్రీ' పురస్కారంతో జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కళాకారుడు యడ్ల గోపాలరావు. తొలుత సాంఘిక నాటికల్లో రంగ ప్రవేశం చేసిన గోపాలం..తరువాత పౌరాణిక నాటకాల్లో ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. ముఖ్యంగా హరిశ్చంద్ర నాటకంలో నక్షత్రకుడిగా గుర్తింపు పొందారు. సంతకవిటి మండలం మందరాడ యడ్ల గోపాలం స్వగ్రామం. అతి సామాన్య కుటుంబంలో జన్మించిన ఆయన 14వ ఏట నుంచే నాటక రంగం వైపు అడుగులు వేశారు. 1964లో తొలిసారిగా ముఖానికి రంగేసుకున్నారు. 'దేశం కోసం' నాటిక తొలి ప్రదర్శన. ఆ తరువాత పావలా, ఆగండి..కొంచెం ఆలోచించండి, ప్రెసిడెంట్ పట్టయ్య, చిల్లరకొట్టు చిట్టెమ్మ, పల్లెపడుచు, పూలరంగడు వంటి 60 సాంఘిక నాటికల్లో నటించి ప్రేక్షకులను అలరించారు యడ్ల గోపాలం.

● డీవీ సుబ్బారావుతో పోటాపోటీగా...

తొలిసారిగా 1967లో పౌరాణిక నాటకంలో నటించారు గోపాలం. తొలినాళ్లలో శ్రీరాముడు, హరిశ్చంద్రుడు, శ్రీకృష్ణుడి పాత్రలను పోషించారు. ఆయన దశ తిరిగింది మాత్రం 1982లో. ఆ ఏడాది డీవీ సుబ్బారావు హరిశ్చంద్రుడిగా, యడ్ల గోపాలం నక్షత్రకుడిగా తొలిసారిగా నటించారు. పోటాపోటీగా నటించడంతో హిట్ పెయిర్‌గా నిలిచారు. అప్పటి నుంచి వందలాది ప్రదర్శనలిచ్చారు. అప్పట్లో గ్రామఫోన్ రికార్డుల ద్వారా నాటక పద్యాలు ప్రజల్లోకి వెళ్లడంతో యడ్ల గోపాలం పేరు ప్రాచుర్యంలోకి వచ్చింది. డీవీ సుబ్బారావుతో సమానంగా గుర్తింపు దక్కించుకున్నారు. ప్రఖ్యాత ఏవీఎం సంస్థ సైతం యడ్ల గోపాలంతో నక్షత్రకుడి పాత్రకు సంబంధించిన పద్యాలు పాడించుకుందంటే ఏ స్థాయిలో గుర్తింపు సాధించారో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటి వరకూ యడ్ల గోపాలం దేశ విదేశాల్లో 5,600కుపైగా ప్రదర్శనలిచ్చారు.

● ఎన్నో పురస్కారాలు..

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో సన్మానాలు, సత్కారాలు, అవార్డులను సొంతం చేసుకున్నారు గోపాలం. 2020 జనవరి 26న అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతులమీదుగా పద్మశ్రీ పురస్కారాన్ని స్వీకరించారు గోపాలం. ఆ తరువాత వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారాన్ని దక్కించుకున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో సత్య హరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించారు యడ్ల గోపాలం. ఆ ప్రదర్శనను తిలకించిన సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు స్వయంగా సన్మానించారు. ఎన్టీఆర్ శతజయంతి వేడుకల్లో భాగంగా నార్త్ అమెరికా తెలుగు సొసైటీ వారు గత ఏడాది గోపాలంను ప్రత్యేకంగా ఆహ్వానించి.... సన్మానించారు. యడ్ల గోపాలరావుకు భార్య జయలక్ష్మి, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. అందరూ విద్యాధికులే.



అప్పటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి పద్మశ్రీ పురస్కారం అందుకుంటూ.. (ఫైల్)

● కళాకారులను ప్రోత్సహించాలి..

పౌరాణిక కళారంగానికి వెండితెర, బుల్లితెర కారణంగా ఆదరణ తగ్గింది. కానీ ఇటీవల సోషల్, డిజిటల్ మీడియా వచ్చాక కళలకు, కళాకారులకు ఆదరణ మళ్లీ పెరుగుతుండడం హర్షించదగ్గ పరిణామం. కళలు, కళాకారులకు ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా తరహాలో కళాకారులకు కూడా రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరం ఉంది. కళా పరిషత్‌లు, అకాడమీలు నిర్మిస్తే కళలకు, కళాకారులకు ఆదరణ పెరగడం తథ్యం.

-యడ్ల గోపాలం

ఇది శిథిలం.. అది నిరుపయోగం

● ఇదీ ఎం.పణుకువలస అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాల భవనాల పరిస్థితి ● ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు



ఎం పణుకువలసలో శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనం

బొబ్బిలి రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం.బూర్జవలస పంచాయతీలో గల ఎం.పణుకు వలస అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరుకుంది. దశాబ్దాల కిందట నిర్మించిన భవనం కావడంతో శ్లాబు పెచ్చులూడి పడుతోంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఇక్కడ ఆరుగురు చిన్నారులు కేంద్రానికి వస్తున్నారు. వర్షాకాలంలో కారిపోతుండడంతో పాటు నీరు చిమ్ము తుండడంతో కేంద్రం నిర్వహణకు అవస్థలు తప్పడం లేదు. కేంద్రం నిర్వహించే సమయంలో పిల్లలపై పడితే ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఎం.పణుకువలస అంగన్‌వాడీ కేంద్రం శిథిలావస్థకు చేరిన విషయం తన దృష్టికి రాలేదని ఐసీడీఎస్ పీవో విజయలక్ష్మి తెలిపారు. కొత్త భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని... ఇంకా ప్రభుత్వం నుంచి అనుమతి రాలేదని చెప్పారు.



ఎం.పణుకువలసలో నిరుపయోగంగా ఉన్న పాఠశాల భవనం

నిరుపయోగంగా పాఠశాల భవనం..

ఎం.పణుకువలస ప్రాథమిక పాఠశాలలో ఓ భవనం నిరుపయోగంగా మారింది. ఇక్కడ 16 మంది అభ్యసిస్తుండగా ఇద్దరు ఉపాధ్యాయినులు బోధిస్తున్నారు. పాఠశాలకు రెండు భవనాలు ఉండగా ఒకటి నిర్వహణ లేక శిథిలావస్థకు చేరుకుంది. ఆ భవనం వెనుక భాగంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో తరగతులు నిర్వహించడానికి భయపడి.. ఖాళీచేశారు. ప్రస్తుతం ఒక భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాన్ని వెంటనే కూల్చి వేయాలని, లేకపోతే మరమ్మతులు నిర్వహించాలని విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేశామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా ఆ భవనాన్ని కూల్చివేసి కొత్త భవనాన్ని నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో లక్ష్మణరావు మాట్లాడుతూ ఎం.పణుకువలస పాథమిక పాఠశాలలో ఓ భవనం శిథిలావస్థకు చేరడంతో తొలగింపునకు ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు.

ఇక్కడి అమ్మాయి..
అక్కడ అందాల రాశి

● అమెరికా తెలుగు అందాల భామల పోటీలో ఫైనల్‌కు సాయిసాత్విక
● ఆమె స్వస్థలం తెర్లాం మండలం సోమిదవలస



బొబ్బిలి /తెర్లాం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా తెర్లాం మండలం సోమిదవలస గ్రామానికి చెందిన చందక సాయిసాత్విక అరుదైన గుర్తింపును పొందారు. మే 25న డల్లాస్‌లో జరుగనున్న అమెరికా తెలుగు అందాల భామల పోటీలో పాల్గొనేందుకు ఆమె ఎంపికయ్యారు. బాపట్ల అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీఎస్సీ పూర్తి చేసి.. డేటా ఎనలైటికల్ కోర్సులో ఎమ్మెస్సీ చదువుకునేందుకు ఆమె అమెరికాలోని యూఎన్‌టీ యూనివర్సిటీలో (డల్లాస్) చేరారు. అక్కడ నిర్వహించిన తెలుగు అందాల పోటీలో పాల్గొన్నారు. సుమారు 300 మంది తెలుగు అమ్మాయిలు ఈ పోటీలో పాల్గొనగా... సాయిసాత్విక ఫైనల్స్‌కు ఎంపికయ్యారు. మే 25న జరిగే ఫైనల్స్‌లో తనకు తెలుగువారంతా ఓటు చేయాలని ఆమె సామాజిక మాధ్యమాల ద్వారా కోరారు. ఆమె తండ్రి చందక సూర్యకుమార్ వివిధ సంస్థలలో మెకానికల్ ఇంజనీరుగా పనిచేశారు. తల్లి సబిత సోమిదవలస రేషన్ డిపో డీలర్. ఆమె అక్క సాయి సుస్మిత అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. సాయిసాత్విక, సాయిసుస్మిత ఇద్దరూ రాజాంలోని సెయింట్‌యాన్స్ పాఠశాలలో చదువుకొని టాపర్స్‌గా నిలిచారు. బాసరలో ట్రిపుల్ ఐటీ చేశారు.

ఫ్రీలాన్స్ జర్నలిస్టు కావాలనుకుంది

అమెరికాలో తెలుగు అందాల అమ్మాయిల పోటీలకు ఎంపికైన మా రెండో అమ్మాయి సాయిసాత్విక ఫ్రీలాన్స్ జర్నలిస్టు కావాలని కలలు కనింది. చిన్ననాటి నుంచి రచనా వ్యాసంగం పట్ల ఆమెకు మక్కువ ఎక్కువ. నేషనల్ బాల భవన్ ఢిల్లీలో జరిగిన క్రియేటివ్ రైటింగ్ పోటీలలో బహుమతులు సాధించింది. మా తల్లిదండ్రులు పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం పలగర గ్రామంలో ఉంటున్నారు. తండ్రి తుమ్మగంటి గోపాలకృష్ణారావు ఉపాధ్యాయులు. ఆయన జర్నలిస్టు. అనేక రచనలు చేశారు. ఇప్పటికీ రచనలు చేస్తున్నారు. మా కుమార్తె అమెరికాలో తెలుగు అందాల అమ్మాయి పోటీలకు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. మేలో జరిగే ఫైనల్స్‌లో కూడా ఆమె విజయం సాధించి మిస్ అమెరికా తెలుగు అందాల భామ టైటిల్‌ను కైవసం చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. తెలుగువారి అందరి ఆశీస్సులు నా కుమార్తెకు అందజేసి ఈ పోటీలో గెలిపించాలని కోరుకుంటున్నాను.

-సబిత, సాయిసాత్విక తల్లి



కుటుంబ సభ్యులతో సాయిసాత్విక

ఘనంగా అగ్నిగంగమ్మ జాతర

పార్వతీపురం టౌన్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల ఇలవేల్పు అగ్నిగంగమ్మ జాతరను ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్వతీనగర్‌లో గల అగ్నిగంగమ్మ ప్రధాన ఆలయం వద్ద అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని వివిధ వీధుల నుంచి వచ్చిన మహిళలు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా గుర్తింపుపొందిన అమ్మవారికి ఉత్సవ కమిటీ పెద్దలు పట్టువస్త్రాలను సమర్పించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన చేశారు.



అగ్నిగంగమ్మను దర్శించుకుంటున్న భక్తులు

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.3.89 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

పాలకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోటదుర్గమ్మ అమ్మవారి హుండీలను బుధవారం లెక్కించారు. మార్చి 3 నుంచి 26వ తేదీ వరకు 23 రోజులకు రూ.3,08,943 లక్షల ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈవో వి.వి.సూర్యనారాయణ తెలిపారు. అలాగే మిక్స్‌డ్ బంగార 36 గ్రాములు, వెండి కేజీ 900 గ్రాములు వచ్చినట్టు పేర్కొన్నారు. ఈ లెక్కింపులో తనిఖీదారు రామారావు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పోలమాంబ ఆదాయం రూ.2.36 లక్షలు..

మక్కువ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదేవత శంబర పోలమాంబ 9వ వారం జాతర ఆదాయం రూ.2 లక్షల 36 వేల 700 వచ్చినట్టు ఈవో వి.వి.సూర్యనారాయణ బుధవారం తెలిపారు. శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.22 వేల 500, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.64 వేల 760, కేశఖండన ద్వారా రూ.2 వేలు వచ్చిందన్నారు. మహాన్నదానం విరాళం ద్వారా రూ.81 వేల 335, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.40 వేల 395, పులిహోరా ప్రసాదం ద్వారా రూ.25,710 వచ్చినట్టు తెలిపారు.

ప్రభుత్వ భవనాలకు గ్రహణం వీడేనా?

● పూర్తయి ఏడాదైనా.. వినియోగానికి దూరం

శృంగవరపుకోట రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పెదఖండేపల్లిలో గత ప్రభుత్వ హయాంలో పూర్తయిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. ఏడాది కిందటే భవనాలు పూర్తయినా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. రూ.కోట్లు ప్రజాధనంతో నిర్మించిన భవనాలు వినియోగానికి నోచుకోకపోవడంతో రూపు కోల్పోతున్నాయి. ఇప్పటికే ఆకతాయిలు కిటికీల అద్దాలను ధ్వంసం చేశారు. మరి కొందరు ఈ భవనాలను అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నారు. నిత్యం పేకాట, తాగుడుకు స్థావరాలుగా మారాయి. భవనాలు నిరుపయోగంగా ఉన్న దానిపై పంచాయతీ రాజ్ జేఈ సత్యనారాయణను వివరణ కోరగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల వాటిని ప్రారంభించలేకపోయామన్నారు. త్వరలోనే ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రారంభించే ఏర్పాట్లు చేస్తామన్నారు.



ప్రారంభోత్సవానికి నోచుకోని పెదఖండేపల్లి సచివాలయ భవనం



అద్దాలు దెబ్బతిన్న దృశ్యం

కళతప్పిన సాగునీటి కాల్వలు

●మరమ్మతులు చేపట్టని యంత్రాంగం ● 25 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు ప్రశ్నార్థకమే..

నెల్లిమర్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల ప్రాంతంలో ఏటా వేలాది ఎకరాల ఆయకట్టుకు నీరందించే సాగునీటి కాల్వలు కళ తప్పాయి. స్వరూపాన్ని కోల్పోయి పిచ్చి మొక్కలతో నిండిపోయాయి. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోక శివారు భూములకు నీరందే పరిస్థితి లేకుంది. సాగునీటి కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టుదారులు సంబంధిత అధికారులను పలుమార్లు కోరినా చర్యలు శూన్యం. దాంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా కుమిలి చానల్, డెంకాడ చానల్‌లకు మరమ్మతులు చేపడితే పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల గ్రామాల్లో సుమారు 25వేల ఎకరాల ఆయకట్టుకు ఇవే ఆధారం. అలాంటి రెండు చానళ్లు పిచ్చి మొక్కలు, ఇతరత్రా వ్యర్థాలతో నిండి ఉన్నాయి. వరదనీటి మిగులు జలాలు చెరువులు, వాగులు, వంకల ద్వారా ప్రవహిస్తూ కుమిలిలో కలిసేలా సాగునీటి వ్యవస్థను రూపొందించారు. ఈ చానల్ ద్వారా చెరువులు నింపుతూ 4 మండలాల గ్రామాల్లోని ఆయకట్టుకు సాగునీరు అందించడం జరుగుతుంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన కుమిలి చానల్ కనీసం మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదు. అలాగే తోటపల్లి ప్రధాన కాల్వ నుంచి నియోజకవర్గంలోని వందలాది ఎకరాలకు నీరు అందించేందుకు ఏర్పాటు చేసిన కాలువ సైతం మరమ్మతులకు నోచుకోవడం లేదు. నాలుగు మండలాలలోనూ ఇదే దుస్థితి. ఫలితంగా శివారు భూములకు సకాలంలో సాగు నీరందే పరిస్థితి లేదు. ఖరీఫ్ నాటికి కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టుదారులు కోరారు.



మరమ్మతులకు నోచుకోని కుమిలి చానల్



పిచ్చి మొక్కలతో నిండిన తోటపల్లి కాలువ

పైడిమాంబ ఆలయంలో హుండీ లెక్కింపు

విజయనగరం రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సిరులతల్లి పైడిమాంబ ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. శివాలయం వీధిలోని పైడిమాంబ కల్యాణ మండపంలో లెక్కింపు చేపట్టారు. చదురుగుడికి సంబంధించి రూ.34.51 లక్షలు, 35.7 గ్రాముల బంగారం, 449 గ్రాముల వెండి సమకూరింది. వనంగుడిలో రూ.9,43,375 నగదు, 6.4 గ్రాముల బంగారం, 667 గ్రాముల వెండి లభించింది.

కోటమ్మ హుండీ ఆదాయం రూ.5.18 లక్షలు

శృంగవరపుకోట రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొట్టాంలో కోటమ్మతల్లి పండగ ఆదాయాన్ని బుధవారం ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ లెక్కించారు. హుండీ ద్వారా రూ.5.18 లక్షలు, 6 గ్రాముల బంగారం, అర కేజీ వెండి లభించిందని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పూసపాటిరేగ, మార్చి26 (ఆంధ్రజ్యోతి): కుమిలి సబ్‌స్టేషన్ పరిధిలోని కుమిలి, రెల్లివలస, చల్లవానితోట, బత్తివలస, బొర్రవానిపాలెం గ్రామాలకు గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నేపథ్యంలో సరఫరా నిలిపివేయనున్నామన్నారు.

రేపు 12 గ్రామాలకు కట్..

●గజపతినగరం: జిన్నాం పరిధిలో 33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతు పనుల నేపథ్యంలో శుక్రవారం 12 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు బొబ్బిలి డివిజన్ డీఈ శ్రీనివాసరావు ఓ ప్రకటలో తెలిపారు. మండలంలోని జిన్నాం, ముచ్చర్ల, ఎం.కొత్తవలస, రంగుపురం, రామన్నపేట, లోగిస, లింగాలవలస, తుమ్మికాపల్లి కెంగువ, మల్లునాయుడుపేట, కొండపేట, వేమలిల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

విద్యార్థుల ఆత్మరక్షణకు శిక్షణ

విజయనగరం క్రైం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినుల ఆత్మరక్షణకు శక్తి టీమ్స్ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల ఆత్మరక్షణకు అవసరమైన మెలకువలను నేర్పుతూ వారిలో చైతన్యం నింపుతారన్నారు. ఆపద సమయాల్లో ఎటువంటి ఆందోళన చెందకుండా స్పందించేందుకు అవసరమైన మానసిక పరిపక్వత పొందేందుకు వారిని సన్నద్ధం చేస్తారన్నారు.

బాలికకు సీఎం రిలీఫ్ ఫండ్

రేగిడి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో బాలకావలస గ్రామానికి చెందిన కార్తీక్ కుమార్తె రితిక్ష అనారోగ్యానికి గురైన నేపథ్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2.15 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్‌ను ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుధవారం బాలిక తండ్రికి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, పాలవలస రామచంద్రినాయుడు ఉన్నారు.

వైస్ ఎంపీపీ ఎన్నికకు ఏర్పాట్లు పూర్తి

భోగాపురం, మార్చి26 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం నిర్వహించనున్న వైస్ ఎంపీపీ ఎన్నికకు సంబంధించిన ఏర్పాట్లను డిప్యూటీ సీఈవో ఆర్.వెంకటరమణ పూర్తి చేశారు. వైస్ ఎంపీపీ ఎన్నికకు నామినేషన్లు వేయడం, 11 గంటలకు ఎన్నిక నిర్వహించనున్నారు. ఎన్నిక నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు సీఐ ఎన్వీ ప్రభాకర్ బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గాయత్రి పాల్గొన్నారు.

100 పనిదినాలు కల్పించకుంటే చర్యలు

పూసపాటిరేగ, మార్చి26 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని పంపంచాయతీ పరిధిలో ఉపాధి వేతనదారులకు 100 రోజుల పని కల్పించాల్సిందేనని డ్వామా పీడీ శారదాదేవి స్పష్టం చేశారు. మెజారిటీ పంచాయతీలో కనీసం 50 పని దినాలు కూడా కల్పించని తీరుపై ఆమె మండి పడ్డారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీవో రత్నమాల, ఎంపీడీవో రాధిక ఉన్నారు.

సంత వేలం పాట ఖరారు

వేపాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దాంలో ఆదివారం సంత వేలం పాటను అదే గ్రామానికి చెందిన కొర్రాయి అప్పలకొండ రూ.1.13 లక్షలకు పంచాయతీ అధికారులు ఖరారు చేశారు. బుధవారం ఈవోపీఆర్‌డీ రవికుమార్ సారథ్యంలో పంచాయతీ కార్యదర్శి భారతి, సర్పంచ్ యర్రా రామలక్ష్మి, గ్రామ పెద్దల సమక్షంలో వేలం పాట నిర్వహించారు.

నగరానికి అమృత్ 2.0 అర్హత



పత్రాన్ని అందుకుంటున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విజయనగరం నగరపాలక సంస్థ అమృత్ 2.0 అర్హత సాధించింది. భారత గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధులు బుధవారం న్యూఢిల్లీలో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్యకు ఆక్విఫైర్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు కింద 50 శాతం నిధుల మంజూరు జారీ పత్రాన్ని అందజేశారు. దేశవ్యాప్తంగా గుర్తించిన 75 నగరాల్లో విజయనగరం ఒకటి. అమృత 2.0 పథకం ద్వారా 10 అర్బన్ ఆక్విఫైర్ సస్టైన్‌బుల్ మేపింగ్ కింద అర్హత సాధించిందని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ నీరు అందిస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలో ప్రతీ ఇంటికి తాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. బుధవారం మండలంలోని కళ్లేంపూడిలో రూ.63 లక్షల వ్యయంతో చేపట్టిన పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు, సీనియర్ నాయకులు కరెడ్ల ఈశ్వరరావు, చొక్కాకుల మల్లునాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు ఇళ్లు మంజూరు చేయిస్తా..

●వేపాడ: మండలంలోని వీలుపర్తి శివారు రాయుడుపేటలోని అగ్ని ప్రమాద బాధితులకు పక్కా ఇళ్లను మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. బుధవారం అగ్ని ప్రమాద బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శనాపతి లీల ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పొట్నూరు వరలక్ష్మి సమకూర్చిన వంట సామగ్రి, దుప్పట్లు, టార్పాలిన్లను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లైంగికంగా వేధిస్తే 20 ఏళ్ల జైలు



మాట్లాడుతున్న న్యాయాధికారి విజయకల్యాణి

నెల్లిమర్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగుంపలో పోక్సో చట్టంపై న్యాయ అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఫ్యామిలీ కోర్టు న్యాయాధికారి విజయకల్యాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైంగికంగా బాలికలను వేధించినా, అవమాన పరచినా నేరం చేసిన వ్యక్తికి కనీసం 20 సంవత్సరాల జైలు శిక్ష తప్పదన్నారు. బాలికలకు దగ్గర వారి నుంచే ముప్పు పొంచి ఉందన్నారు. ఈనేపథ్యంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బొబ్బిలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.రోహిణి రావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ డి.సీతారాం, కొండగుంప సర్పంచ్ పి.అప్పన్న, ఎస్ఐ ఎం.గణేష్, గ్రామ సచివాలయ కార్యదర్శి తౌడు ఉన్నారు.

కొత్తవలసలో న్యాయవాద సంఘం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

కొత్తవలస, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస న్యాయవాద సంఘం ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఇదివరకే సంఘం అధ్యక్షురాలిగా ఆర్ఎస్‌వీఎల్ దేవి, ఉపాధ్యక్షుడిగా ఎన్.వి. సత్యనారాయణ, గ్రంథాలయ కార్యదర్శిగా బోజంకి సన్యాసిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, బుధవారం ప్రధాన కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి పదవులకు ఎన్నిక నిర్వహించారు. ఈ పోటీలో ప్రధాన కార్యదర్శిగా వై.జి.నాయుడు, జాయింట్ సెక్రటరీగా గవర కృష్ణ ఎన్నికయ్యారు. కోశాధికారిగా మామిడి కృష్ణమూర్తిని కార్యవర్గం ఎంపిక చేసింది. మహిళా సభ్యురాలిగా జి.పుష్పలత, కార్యవర్గ సభ్యులుగా విన్నకోట రాజేశ్, ఆర్.కృష్ణంనాయుడులను ఎన్నుకున్నారు.

కార్మికులను రెగ్యులర్ చేయండి

విజయనగరం దాసన్నపేట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలని మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ.జగన్మోహన్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం ఎల్‌బీజీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అప్కాస్‌ని రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు ఇవ్వడం తగదన్నారు. ఏప్రిల్ 1న మున్సిపల్, పట్టణ కేంద్రాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఆదినారాయణ, దుర్గారావు, బాబురావు, హరిబాబు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సమాయత్తం కండి



మాట్లాడుతున్న బంగార్రాజు

నెల్లిమర్ల, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు టీడీపీ శ్రేణులు మరోసారి సమాయత్తం కావాలని మార్క్‌ఫెడ్ చైర్మన్, ఇఫ్కో డైరెక్టర్ కర్రోతు బంగార్రాజు క్యాడర్‌కు పిలుపునిచ్చారు. నెల్లిమర్లలో బుధవారం టీడీపీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోకవర్గ పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ అధ్యక్షతన పార్టీ నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలను ప్రతీ కార్యకర్త, నాయకుడు ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. అధిష్ఠానం రూపొందించిన కేఎస్ఎస్ (కుటుంబ సాధికారిత సారధి) వ్యవస్థను పటిష్ఠంగా నడిపించాలన్నారు. నియోజకవర్గంలోని కార్యకర్తల సమస్యలను అధిష్ఠానానికి ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నానన్నారు. గడిచిన ఎన్నికల్లో అధిష్ఠానం ఆదేశానుసారం పొత్తు ధర్మాన్ని గౌరవించి జనసేన అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించామన్నారు. అయితే ఎన్నికల తరువాత కార్యకర్తలు, నాయకుల సమస్యల పరిష్కార విషయంలో అన్యాయం జరుగుతున్న మాట వాస్తవమేనన్నారు. కార్యక్రమంలో డెంకాడ మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, నెలిమర్ల, భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మండల కమిటీల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్, కర్రోతు సత్యం, పల్లె భాస్కరరావు, మహింతి శంకరరావు, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, జిల్లా కార్యదర్శి లంక అప్పలనాయుడు, పతివాడ అప్పలనారాయణ, ఆకిరి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌తో సమస్యల పరిష్కారం



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

రాజాం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రజా దర్బార్‌తో ప్రజా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నాలుగు మండలాల నుంచి దాదాపు 100 వినతులను ఆయన స్వీకరించారు. రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, పింఛన్లు, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతులు అధికంగా వచ్చాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో అందిన వినతుల్లో 90 శాతం వరకు పరిష్కరించామన్నారు. అనంతరం స్థానిక మార్కెట్ కమిటీ ఆవరణలో నిర్వహించిన మెగా రుణమేళాలో ఆయన పాల్గొన్నారు. స్వయం సహాక సంఘాల సభ్యులకు చెక్ అందజేశారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు నంది సూర్యప్రకాశరావు, బొత్స వాసుదేవరావునాయుడు, గురవాన నారాయణరావు, జొన్నాడ రంజిత్, యు.పి.రాజు, ఏరియా కో-ఆర్డినేటర్ చిరంజీవి, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణంరాజు, మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి వెన్నుదన్ను

రాజాం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీకి కార్యకర్తలే వెన్నుదన్ను అని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. బుధవారం రాత్రి శ్యాంపురంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తల సమస్యలు తెలుసుకుని వారికి అండగా నిలబడతామన్నారు. పార్టీ కోసం పనిచేసిన వాళ్లకు ఏ ఆపద వచ్చినా ఆదుకుంటామన్నారు. అనంతరం చీపురుపల్లి ఆర్డీవో సత్యవాణితో కలిసి రాజాం, సంతకవిటి, వంగరల్లో కొత్తగా నియమితులైన రేషన్ డీలర్లకు నియామక పత్రాలన ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు బొత్స వాసుదేవ రావునాయుడు, కోళ్ల అప్పలనాయుడు, గురవాన నారాయణరావు, నంది సూర్యప్రకాశరావు, పిన్నింటి మోహనరావు, గట్టి భాను, సుమల మన్మధరావు, టంకాల కన్నంనాయుడు, శాసపు రమేష్‌కుమార్ తదితరులున్నారు.

రామచంద్రయ్యకు కళా పరామర్శ



రామచంద్రయ్యతో ఎమ్మెల్యే కళా

చీపురుపల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి సి.రామచంద్రయ్యను చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు బుధవారం పరామర్శించారు. రామచంద్రయ్యకు ఇటీవల పుత్ర వియోగం కలిగిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. హైదరాబాదులోని రామచంద్రయ్య నివాసానికి వెళ్లారు. రామచంద్రయ్య కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

రక్తదానం చేసిన కొవ్వాడ యువత

పూసపాటిరేగ, మార్చి26 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొవ్వాడ గ్రామానికి చెందిన యువకులు బుధవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి 100 యూనిట్ల రక్తాన్ని అందజేశారు. శిబిరానికి ప్రత్యేక అతిథిగా జనసేన నాయకుడు, సర్పంచ్ కోట్ల రఘు పాల్గొన్నారు. రక్తదానం చేసిన యువకులను అభినందించారు. కార్యక్రమంలో లెంక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ వద్దు.. రోడ్డును విస్తరిస్తే చాలు

శృంగవరపుకోట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట మండల పరిధిలోని విశాఖ-అరకు రోడ్డును విస్తరిస్తే.. భూములను సేకరించే అవసరం ఉండదని రెవెన్యూ అధికారులకు రైతులు స్పష్టం చేశారు. బుధవారం స్థానిక పోతురాజు బట్టి వద్ద రెవెన్యూ అధికారులు రైతుల అభిప్రాయం తీసుకున్నారు. నెలిపూడి రమణ, కన్నయ్య అభిప్రాయాలను గ్రామ రెవెన్యూ అధికారి నమోదు చేశారు. పెందుర్తి నుంచి బొడ్డవర వరకు జాతీయ రహదారి 516 బి విస్తరణ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ రోడ్డుకు వెంకటరమణపేట నుంచి కాపుసోంపురం వరకు ఎస్.కోట పట్టణం బయట నుంచి బైపాస్ నిర్మాణానికి భూసేకరణ చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు దాదాపు 36 ఎకరాల వరకు అవసరం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ భూములు ఇచ్చేందుకు ఇష్టపడటం లేదు. అదే విషయాన్ని ఈనెల 10న కలెక్టర్ గ్రీవెన్స్‌లో రైతులు ఫిర్యాదు చేశారు. రైతుల తరఫున ఏపీ రైతు సంఘం నాయకుడు మద్దిల రమణ మాట్లాడారు. ప్రస్తుత రహదారిలో ఆక్రమణలను తొలగించి విస్తరణ చేపడితే భూసేకరణ చేసే అవకాశం ఉండదని వివరించారు. రైతులు వసంత సత్యారావు, మళ్ల సత్యారావు, కోటాన సూర్యం తదితరులున్నారు.



అధికారులతో సమావేశమైన రైతులు

ద్విచక్ర వాహనం అదుపుతప్పి.. లారీ కింద పడి..

●సాలూరులో గిరిజన మహిళ దుర్మరణం

సాలూరు,మార్చి 26 (ఆంధ్రజ్యోతి):పట్టణంలోని కోటవీధి జంక్షన్ వద్ద బుధవారం ఓ ద్విచక్రవాహనం అదుపుతప్పడంతో లారీ టైరు కింద పడి గిరిజన మహిళ దుర్మరణం పాలైంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. రామభద్రపురం మండలంలోని ఎనుబరువుచింతలవలస గ్రామానికి చెందిన టింగల గౌరమ్మ(38) ఓ మతవిశ్వాసకురాలిగా సోదరి మాలధారణలో దీక్ష చేస్తోంది. బుధవారం మక్కువ మండలంలోని ఎర్రసామంతవలసలో గల పుణ్యక్షేత్రంలో నిర్వహించిన పాపప్రాశ్చత్తప పాదయాత్ర కార్యక్రమంలో గ్రామస్థులతో కలిసి పాల్గొంది. అనంతరం పూజ ముగిసిన తర్వాత తన గ్రామానికి చెందిన బోయిన పెంటయ్య, దోనేరు లక్ష్మిలతో పాటు ద్విచక్ర వాహనంపై ఎర్రసామంతవలస నుంచి తిరిగి ఎనుబరువు చింతలవలస బయలుదేరారు. సాలూరు కోట వీధి జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పిడంతో దానిపై ఉన్న ముగ్గురు కిందపడిపోయారు. జారిపడిన వెంటనే లారీ వెనుకభాగంలో ఉన్న టైర్ కిందపడిపోవడంతో గౌరమ్మ అక్కడికక్కడే దుర్మరణం పాలైంది. మిగతా ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. ఐదేళ్ల కిందట గౌరమ్మ భర్త ప్రసాద్ మృతి చెందారు. తన ఇద్దరు ఆడపిల్ల లను గౌరమ్మ కూలి పనులు చేస్తూ జీవిస్తోంది. గౌరమ్మ మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇద్దరు కుమార్తెలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పట్టణ సీఐ అప్పలనాయుడు కేసు నమోదు చేశారు.

బాలిక అదృశ్యం

మెంటాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): చల్లపేట గ్రామానికి చెందిన ఈదిబిల్లి భాను (14) బుధవారం అదృశ్యమైనట్టు కేసు నమోదు చేశామని ఆంధ్ర ఎస్ఐ సీతారాం తెలిపారు. మానసిక అంగవైకల్యంతో బాధపడుతున్న బాలిక బుధవారం చల్లపేట బస్టాండులో ఆర్టీసీ బస్సు ఎక్కి, ఎటో వెళ్లినట్టు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదులో పేర్కొన్నారన్నారు.

మోకాలిపై కూర్చుని గిరిజనుల వినతి



పాలకులకు దండం పెడుతున్న గిరిజనులు

శృంగవరపుకోట రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిశిఖర పంచాయతీ దారపర్తి, బొడ్డవరల్లోని గిరిజన యువత బుధవారం వినూత్నంగా మోకాలిపై కూర్చుని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కలెక్టర్‌కు దండం పెట్టారు. గిరిజన విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు. ఈ సందర్భంగా గిరిజన సంఘ నాయకుడు జరత గౌరీష్ మట్లాడుతూ జిల్లాలు విడిపోయాక గిరిజనులకు ఐటీడీఏ ఫలాలు దక్కడం లేదన్నారు. కొండలపై ఉన్న విద్యార్థులు 260 మంది ఉంటే ఎస్.కోట పట్టణంలో 160 మందికి మాత్రమే వసతిగృహం ఉందన్నారు. దాంతో మిగతా వారు సాలురు, పార్వతీపురం, విజయనగరంలో చదువుతున్నారన్నారు. దానివల్ల విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని, మరికొందరు పిల్లలను చదువు మాన్పిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఎస్.కోట మండల కేంద్రంలో 260 మందికి వసతిగృహం పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలని కోరారు. ఎస్.కోటలో బాలిక ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కలెక్టర్‌ను మూకుమ్మడిగా వారు కోరారు.

రైల్వేస్టేషన్ రోడ్డులో నేలకొరిగిన చెట్టు



నేలకొరిగిన చెట్టు, విరిగిన విద్యుత్ స్తంభం

గజపతినగరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డులో చెట్టు నేలకొరిగింది. దాంతో మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. రోడ్డు పక్కనే ఉన్న చెట్టుకు చాన్నాళ్లుగా చెదలు పట్టాయి. ఎప్పుడు ప్రమాదానికి గురికావల్సి వస్తుందోనని స్థానికులు భయపడేవారు. బుధవారం సాయంత్రం ఒక్కసారిగా చెట్టు నేలకొరిగింది. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. ఎవరికీ ఎటువంటి నష్టం వాటిల్లలేదు. అదే సమయంలో రాయపూర్ నుంచి విశాఖ వెళ్లే పాసింజర్ రైలు వచ్చింది. దీంతో ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న విద్యుత్ శాఖ ఏఈ కృష్ణమూర్తి చెట్టును తొలగించే ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.

కంకర, రాళ్ల తవ్వకానికి సడలింపు



మాట్లాడుతున్న అజయ్‌కుమార్

వేపాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొద్దాంలో కంకర, పునాది రాళ్ల తవ్వకానికి ఎలాంటి ఆంక్షలు ఉండవని ఉత్తరాంధ్ర మైన్స్ బయాలజీ విజిలెన్స్ ఏడీ అజయ్‌కుమార్ అన్నారు. చెక్‌పోస్టులో అధికారులు అడ్డుకోరని స్పష్టం చేశారు. బుధవారం మండలంలోని బొద్దాంలో ప్రైవేట్ టోల్‌గేట్లు ఎత్తివేయాలని, మైన్స్ అధికారుల ఆగడాలపై చర్యలు చేపట్టాలని నాలుగు రోజులుగా పలువురు రైతులు, ట్రాక్టర్ యజమానులు చేపడుతున్న ఆందోళనలకు ఆయన స్పందించారు. రైతులు, ట్రాక్టర్ యజమానులు, సీఐటీయూ నాయకుడు జగన్‌లతో మాట్లాడారు. ఈ సందర్భంగా జగన్.. ఏడీతో మాట్లాడుతూ ప్రైవేట్ టోల్‌గేట్ల సిబ్బంది విజిలెన్స్ బోర్డులు పెట్టుకుని జులుం చేస్తున్నారన్నారు. దాంతో ఆయన స్పందించారు. టోల్‌గేట్లపై రాతపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వాలన్నారు.

రంగస్థల కళాకారుడికి సత్కారం



తిరుపతినాయుడును సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం బాబామెట్ట, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సీనియర్ రంగస్థల కళాకారుడు, సినీ నటుడు దాసరి తిరుపతినాయుడును బుధవారం సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘ ప్రతినిధులు సత్కరించారు. స్థానిక పెన్షనర్ల భవనంలో కార్యక్రమం నిర్వహించారు. 30 ఏళ్లనుంచి తిరుపతినాయుడు కళాకారుడిగా అందరి మన్ననలు పొందడంతో పాటు ఉపాధ్యాయుడిగా విద్యార్థుల ఉన్నతికి కృషి చేశారని వారు కొనియాడారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి

బొండపల్లి, మార్చి 26(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై తరచు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో వాటి నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని బొబ్బిలి డీఎస్పీ భవ్యరెడ్డి సూచించారు. మండలంలోని బోడసింగిపేట, అంబటివలస, గొట్లాం గ్రామాల్లో బైపాస్ రోడ్డుతో పాటు జాతీయ రహదారిని బుధవారం సాయంత్రం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంబటివలస వద్ద తరచుగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతంలో రహదారి కుంగిపోయి ఎత్తు పల్లాలు ఉండటం వల్ల వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నట్లు పోలీసులు డీఎస్పీకి తెలిపారు. తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించిన చోట నివారణకు స్టాపర్లు, వేగనిరోధకాలు ఇప్పటికే ఏర్పాటు చేసినప్పటికీ మరిన్నిచోట్ల ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గజపతినగరం సీఐ జి.ఎ.వి.రమణ, ఎస్ఐ మహేశ్ ఉన్నారు.

సీహెచ్‌ఈసీ గ్రూపును ప్రవేశపెట్టండి



మంజులావీణకు వినతిపత్రం అందజేస్తున్న అధ్యాపక సంఘ సభ్యులు

పార్వతీపురం టౌన్/బెలగాం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఇంటర్‌లో 2025-26 విద్యాసంవత్సరం నుంచి కామర్స్ హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్(సీహెచ్‌ఈసీ) గ్రూపును ప్రవేశపెట్టాలని అధ్యాపక సంఘ సభ్యులు టి.రవికుమార్, భాస్కరరావు తదితరులు కోరారు.ఈ మేరకు బుధవారం మన్యం జిల్లా డీఐ ఈవో మంజులా వీణను వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంబీఐపీసీ గ్రూపును ప్రవేశపెట్టిందని, ఆర్ట్స్ విద్యార్థుల కోసం సీహెచ్‌ఈసీ ప్రవేశపెట్టడం వల్ల పేద విద్యార్థులు ఇంటర్ తరువాత ఉన్నత విద్యకు వెళ్లేందుకు అవకాశంఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపక సంఘ సభ్యులు వాసుదేవరావు, మురళీధర్, శ్రీనివాసరావు, రమేష్, శంకరరావు, శివానంద్, గోవిందరావు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: ఎంపీడీవో

గరుగుబిల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం నిబంధనలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో జి.పైడితల్లి హెచ్చరించారు. బుధవారం మండలంలోని సుంకి, సంతోషపురం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా పలువురు వేతనదారులు వేతనాలు మంజూరు చేయాలని ఎంపీడీవోను కోరారు.కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు ఎస్.ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు అర్హుల గుర్తింపు

గరుగుబిల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులను గుర్తించనున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జి.పైడితల్లి, గరుగుబిల్లి, తోటపల్లి గ్రామీణ వికాస్ బ్యాంకు అధికారులు, గరుగుబిల్లి స్టేట్ బ్యాంక్ అధికారుల ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు మంజూరు చేసిన రుణాల యూనిట్లు దరఖాస్తు చేసుకున్న వారి ధ్రువపత్రాలను పరిశీలించారు.25 పంచాయతీల పరిధిలో పలురకాలవ్యాపారాలు నిర్వహణకు 108 యూనిట్లు మంజూరయ్యాయి. 108 యూనిట్లుకు సంబంధించి 434 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు.కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, ఈవోపీఆర్‌డీ ఎల్.గోపాలరావు, కులశేఖర్, బి.శ్రీనివాసరావు, జి.కృష్ణప్రసాద్‌లు పాల్గొన్నారు.

ధర్మలక్ష్మీపురంలో క్రికెట్ పోటీలు

కురుపాం రూరల్ 26 మార్చి (ఆంధ్రజ్యోతి):మండలంలోని ధర్మలక్ష్మీపురంలో నీలకంఠాపురం పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్రికెట్ పోటీలను పాలకొండ డీఎస్పీ రాంబాబు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పోటీలు ఏర్పాటు చేశామని, గెలుపొందిన జట్టుకు రూ.10 వేలు, రన్నర్‌కు రూ.5 వేలు పారితోషకంతో పాటు ట్రోఫీ అందజేయనున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో ఎల్విన్‌పేట సీఐ హరి, ఎస్‌ఐలు నీలకంఠం, నారాయణరావు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా పన్ను బకాయిలు చెల్లించండి

పాలకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): నెలాఖరులోగా బకాయి పన్నులు చెల్లించి 50 శాతం రాయితీ పొందాలని నగర పంచాయతీ కమిషనర్ టి.జయరాం పేర్కొన్నారు. బుధవారం పాలకొండలో విలేకరులతో మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరం వరకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను బకాయిలను ఏకమొత్తంగా ఒకేసారి చెల్లిస్తే వడ్డీలో 50 శాతం రాయితీ పొందవచ్చునన్నారు. పన్నులను సచివాలయ సిబ్బందికి గాని నగర పంచాయతీలో ఉన్న కలెక్షన్ కౌంటర్‌లో చెల్లించి రశీదు పొందాలన్నారు.

సారా నిర్మూలనే లక్ష్యం

సీతంపేట రూరల్, మార్చి 26(ఆంధ్రజ్యోతి): సారా నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నరాజాం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జైభీమ్ తెలిపారు. బుధవారం మండలంలోని అడ్డాకులగూడ,సీతంపేట గ్రామసచివాలయంలో నవోదయం 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సారా వల్ల కలిగే అనర్థాల గురించి గ్రామస్థులకు వివరించారు. కార్యక్రమంలో సీతంపేట సర్పంచ్ ఆరిక కళావతి, వైస్ ఎంపీపీ సరస్వతి,పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశ పరీక్ష వాయిదా

సీతంపేట రూరల్,మార్చి 26(ఆంధ్రజ్యోతి):సీతంపేట ఐటీడీఏ పరిధిలోని 2025-26 ఏడాదిలో గిరిజనసంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5,6,7,8,9వ తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్లకు ప్రవేశాలకు సంబంధించి వచ్చేనెల ఆరోతేదీన నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష వాయిదా పడినట్లు గురుకులం కార్యదర్శి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ పరీక్షను ఏప్రిల్ 20న నిర్వహిస్తా మని పేర్కొన్నారు.విద్యార్థులు వచ్చే నెల తొమ్మిదో తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

మద్యం మత్తులో హల్‌చల్

పార్వతీపురం రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకంపేట పంచాయతీలో ఓ రెసిడెన్షియల్ స్కూల్ వద్ద మద్యం మత్తులో ఓ వ్యక్తి హల్‌చల్ చేయడంతో ఆయన్ను పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. గట్టు మీద కూర్చొని విద్యార్థుల వివరాలను మద్యం మత్తులో ఉన్న వ్యక్తి అడిగి న్యూసెన్స్ చేయడంతో ఆయన్ను రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు ఎస్‌ఐ సంతోషి గురువారం తెలిపారు.

కొండాపురం ఉపాధ్యాయుడు మృతి

పాలకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండాపురం ప్రాథమిక పాఠశాలలో సెకెండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కరణం నారాయణరావు బుధవారం మృతిచెందాడు. ఈ మేరకుఎంఈవో సోంబాబు, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు సంతాపాన్ని తెలిపారు.

ఏపీడీపై విచారణ చేపట్టాలి

బెలగాం,మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని విధులు నిర్వహిరచిన వెలుగు ఏపీడీ సత్యంనాయుడుపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడుతూ వెలుగు ఏపీడీగా విధులు నిర్వహించిన నాలుగేళ్లలో కేంద్రం నుంచి వచ్చిన వన్‌ధన్ నిధులలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు.

నోరు విప్పి సమాధానం చెప్పలేరా?: పీడీ

సాలూరు రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం సామాజిక ఆడిట్‌లో సర్వే బృందం ఎత్తి చూపిన తప్పులపై క్షేత్రసహాయకులు నోరు విప్పి సమాధానం చెప్పలేరా? అంటూ డ్వామా పీడీ రామచంద్రరావు మండిపడ్డారు. సాలూరు మండలంలో ఏప్రిల్ ఒకటో తేదీ 2023 నుంచి మార్చి 31, 2024వరకు జరిగిన రూ.32.81కోట్ల విలువైన పనులపై బుధవారం ఎంపీడీవో గొల్లపల్లి పార్వతి ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక (సోషల్‌ఆడిట్) జరిగింది. ఈసందర్భంగా సర్వే బృందం ఎత్తిన చూపిన తప్పులపై క్షేత్రసహాయకులను ప్రశ్నించగా అందుకు వారు మౌనంగా ఉండడంతో పీడీ మండిపడ్డారు. కరడవలస, నార్లవలస క్షేత్రసహాయకుల తీరును తప్పుపట్టారు.ఉపాధి పథకంలోతప్పులు జరిగే సహించబోనన్నారు.మండలంలో 29పంచాయతీల్లో మస్తర్లపై సంతకాలు, వేలిముద్రల్లేకుండా చెల్లింపులు పలు చోట్ల జరిగినట్టు సర్వే బృందం ఎత్తి చూపింది.ఎవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమంలో మొక్కల్లేకపోవడం, తక్కువ ఉండడం గుర్తించడంతోపాటువాటికి పేమెంట్లు జరిగినట్టు సర్వేబృందం గుర్తించింది. సర్వే బృందం ఎత్తి చూపిన పలు తప్పులకు డ్వామా పీడీ రికవరికి సిఫారసు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, స్టేట్ రిసోర్స్‌పర్సన్ దాస్, విజిలెన్స్ అధికారి వెంకటరమణ, ఏపీవో రామకృష్ణ పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ ప్రజావేదికలో వివరాలు వెల్లడిస్తున్న సర్వేబృందం

అడారుగెడ్డ రిజర్వాయర్ పూర్తిచేస్తాం

● ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): అడారుగెడ్డ రిజర్వాయర్‌నిర్మాణాన్ని పూర్తిచేస్తామని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు.బుధవారం పార్వతీపురం మండలంలోని అడారుగెడ్డను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడారుగెడ్డ రిజర్వాయర్‌కు ఆనుకొని 600 ఎకరాలు ఆయకట్టు ఉందని, గత ప్రభుత్వం రైతులను మోసగించిందని ఆరోపించారు.ఈప్రాజెక్టు పనులను 2004లో ప్రారంభించారని తెలిపారు. అప్పటి నుంచి ఇంతవరకు ఈ ప్రాజెక్టుకు మోక్షం లేకుండాపోయింది. 2014లో టీడీపీ ప్రభుత్వం భూసేకరణకు ముందు అడుగు వేసిందన్నారు.2019 నుంచి2024 వరకు అడారుగెడ్డ ప్రాజెక్టు ఉందని వైసీపీ ప్రభుత్వానికి ఎందుకు తెలియలేదన్నారు. టీడీపీప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కంకణం కట్టుకుందన్నారు. పోలవరంతోపాటు మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ పూర్తిచేసేందుకు ప్రభుత్వం సిద్ధంగాఉందన్నారు. అడారుగెడ్డ రిజర్వాయర్ విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. కార్యక్రమంలో అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీలో 600 కుటుంబాల చేరికలు

సీతానగరం, మార్చి26(ఆంధ్రజ్యోతి): మండలంలోని నిడగళ్లలో వైసీపీ నాయకుడు గాజాపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆ పార్టీకి చెందిన వైస్ ఎంపీపీ తోడబండి సూర్యనారాయణ, సర్పంచ్ ఆరుద్రమ్మ, మాజీ సర్పంచ్ వెంకటనాయుడు, వైస్ ప్రెసిడెంట్ బర్ల సింహాచలం, పరువాడ తిరుపతినాయుడు, శనపత రాజుసాయితో పాటు 600 కుటుంబాలు టీడీపీలో చేరాయి.ఈ మేరకు బుధవారం పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పెంటసత్యంనాయుడు, రౌతు వేణుగోపాల్‌నాయుడు, నాయకులు గాజాపు తాతబాబు, గంట శ్రీనివాసరావు, బర్ల వెంకటరమణ, తెంటట వెంకటప్పనాయుడు, దామినేని భానుప్రసాద్, పైల నాగభూషణం, అన్నంనాయుడు పాల్గొన్నారు.



సీతానగరం:టీడీపీలోకి చేరిన వైసీపీ నాయకులతో విజయచంద్ర

కొండ శిఖర గ్రామాల్లో ఆరోగ్య కేంద్రాలు

● కురుపాం ఎమ్మెల్యే జగదీశ్వరి



గుమ్మలక్ష్మీపురం:మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మారుమూల కొండ శిఖర గ్రామాల్లో గిరిఆరోగ్య కేంద్రాలు పేరుతో కంటైనర్‌తో తయారుచేసిన ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటుచేస్తున్నట్లు కురుపాం ఎమ్మెల్యేప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి తెలిపారు. బుధవారం మండలంలోని తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెద్దగోడ గిరిజన గ్రామంలో కంటైనర్ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గిరి ఆరోగ్య కేంద్ర సేవలను పరిసరాల గిరిజన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి భాస్కరరావు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో పద్మావతి, తాడికొండ పీహెచ్‌సీ వైద్యులు బుద్దేశ్వరరావు, ఎంపీడీవో సాల్మన్‌రాజు, టీడీపీ నాయకులు వెంపటాపు భారతి, కడ్రక కళావతి పాల్గొన్నారు.

● కురుపాం రూరల్. 26 మార్చి(ఆంధ్రజ్యోతి):మొండెంఖల్ ఆసుపత్రి పరిధిలోని పోరండంగూడలో ప్రభుత్వవిప్ జగదీశ్వరి బుధవారం కంటైనర్ ఆసుపత్రిని ప్రారంభించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో భాస్కరరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా రంజిత్‌కుమార్, టీడీపీ మండలాధ్యక్షుడు కలిశెట్టి కొండయ్య, రంజిత్‌కుమార్ నాయిక్, మొండెంఖల్ వైద్యాధికారి ప్రజ్ఞ పాల్గొన్నారు.

ప్రోత్సహిస్తే ప్రయోజనం

(5వ పేజీ తరువాయి)

అధికారులు వనమూలికల కొనుగోలుపై ఆసక్తి చూపడం లేదు. ఫలితంగా గిరిజనులు వాటిని సేకరించడం లేదు. దీంతో జిల్లా అటవీ ప్రాంతంలో లభించే ఎన్నో వనమూలికలు నేలపాలు అవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వనమూలికల సేకరణపై గిరిజనులకు శిక్షణ ఇచ్చి, వాటిని కొనుగోలు చేసి మార్కెటింగ్ కల్పిస్తే వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం ఉంటుంది.

వనమూలికలు సేకరించాలి

వనమూలికలసేకరణపై గిరిజనులకు అవగాహనకల్పించాలి.జీసీసీ ద్వారా కొనుగోలు చేస్తే గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు. దీనికోసం అధికారులు కృషి చేయాలి.

-ఆరిక సోములు, రైతు, తాడికొండ

ఉన్నతాధికారులు ఆదేశిస్తే సేకరిస్తాం

మా ఉన్నతాధికారులు ఆదేశిస్తే వనమూలికల సేకరణపై గిరిజనులకు అవగాహన కల్పిస్తాం. వాటిని కొనుగోలు చేసేందుకు తగిన ప్రయత్నం చేస్తాం. ప్రస్తుతం అటవీ ఫలసాయాలు మాత్రమే కొనుగోలు చేస్తున్నాం.

- కృష్ణ ప్రసాద్, జీసీసీ మేనేజర్, గుమ్మలక్ష్మీపురం

ఎన్‌సీడీ సర్వే పూర్తి చేయాలి

● వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జగన్మోహనరావు

సీతానగరం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశాఖ నిర్దేశించిన సమయానికి ఎన్‌సీడీ సర్వే పూర్తిచేయాలని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు మెరుగుపడేందుకు కృషిచేయాలని కోరారు. బుధవారం మండలంలోని పెదంకలాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆసుపత్రికి వచ్చే రోగుల ఆరోగ్య సమస్యలు, వైద్య పరీక్షలు, చికిత్స వివరాల రికార్డులను పరిశీలించారు. వైద్య సేవల నిర్ధారణ పరీక్షలు జరుగుతున్న విధానం, ల్యాబ్ పరికరాల పనితీరుపై ల్యాబ్ టెక్నీషియన్‌ను అడిగి తెలుసుకున్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ప్రసవాలు పీహెచ్‌సీల్లో జరిగేలా కార్యాచరణ చేయాలన్నారు. మాతా శిశు సేవలు నిర్ణీత సమయంలో అందేలా చూడాలన్నారు. పిల్లలకు షెడ్యూల్ ప్రకారం టీకాలు వేసి ఆ వివరాలను నమోదు చేయాలన్నారు. అన్ని గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.రమ్య సాయి, సూపర్‌వైజర్లు వరలక్ష్మి, గోపి పాల్గొన్నారు.

పెదమేరంగి జంక్షన్‌లో ఏనుగుల బీభత్సం



నాగావళి నదిలో సేదతీరుతున్న ఏనుగులు

జియ్యమ్మవలస, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదమేరంగి జంక్షన్‌లో ఏనుగుల బీభత్సం సృషించాయి. బుధవారం వేకువజామున పెదమేరంగి కూడలి వద్ద ఉన్న జె.శ్రీనివాసరావుకు చెందిన దుకాణంలో కూరగాయలను చిందరవందర చేసి వెళ్లిపోయాయి. తర్వాత సమీపంలోని మినీ మోడ్రన్ రైస్ మిల్లు వైపు వెళ్లేలోగా ట్రాక్టర్లు, అటవీ శాఖ సిబ్బంది అక్కడ నుంచి వాటిని దారి మళ్లించారు.తరువాత గవరమ్మపేట, వెంకటాపురం గ్రామాలు దాటుకుంటూ బాసంగి గ్రామానికి చేరుకుని అక్కడ నాగావళి నదిలో సేదతీరాయి.

గృహ నిర్మాణాలను పూర్తి చేయాలి: ఈఈ

కొమరాడ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): మే నెలాఖరులోగా గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని గృహ నిర్మాణశాఖ ఈఈ జి.సోమేశ్వరరావు కోరారు. ప్రభుత్వం అదనంగా గృహ నిర్మాణాల లబ్ధిదారులకు ఇస్తున్న రాయితీని లబ్ధిదారులు వినియోగించుకోవాలని సూచించారు. బుధవారం కొమరాడలో నిర్మాణంలో ఉన్న గృహాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల గృహ నిర్మాణశాఖ ఏఈ రాములు, నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు సమస్యకు పరిష్కారం చూపాలి



డంపింగ్ యార్డు సమస్యపై కమిషనర్‌ను నిలదీస్తున్న కౌన్సిలర్

పాలకొండ, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): డంపింగ్‌యార్డు సమస్యకు శాశ్వత పరిష్కరం చూపాలని నగర పంచాయతీ కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, దుప్పాడ పాపినాయుడు కోరారు. బుధవారం స్థానిక నగర పంచాయతీలో చైర్మన్ పల్లా ప్రతాప్ ఆధ్వర్యంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ డంపింగ్‌యార్డును పూర్తి స్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు యంత్రాంగం చొరవ చూపాలని కోరారు.వేసవిని దృష్టిలో ఉంచుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేకప్రణాళికలు రూపొందించాలని కౌన్సిలర్లు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన చైర్‌పర్సన్ తక్షణమే తాగునీటి సమస్యలున్న ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని కమిషనర్ టి.జయరాంకు సూచించారు. కాగా నగర పంచాయతీలో జరిగే సమావేశానికి కౌన్సిల్ ప్రతినిధులు రాకూడదని, కౌన్సిలర్లు మాత్రమే హాజరుకావాలని కమిషనర్ సిబ్బంది, పోలీసులకు సూచించారు. దీనితో పోలీసులు ప్రతినిధులను అడ్డుకోగా ముందస్తుగా సమాచారం ఇవ్వకపోవడంతో తాము హాజరయ్యామని, భవిష్యత్‌లో కౌన్సిలర్లు హాజరయ్యేలా చూస్తామని కమిషనర్‌కు చెప్పడంతో సమావేశ మందిరంలోకి ఆహ్వానించారు. కార్య క్రమంలో వైస్ చైర్మన్ రౌతు హనుమంతురావు, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఇఫ్తార్ విందు

పార్వతీపురం, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లయన్స్‌క్లబ్‌లో గురువారం సాయంత్రం ఆరు గంటలకు రంజాన్ పురస్కరించుకుని ఇఫ్తార్ విందును గురువారం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఆర్.ఎస్.జాన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, శాసనసభ్యులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు కార్యకర్తల సమావేశం

సాలూరు, మార్చి26 (ఆంధ్రజ్యోతి): సాలూరులో నియోజకవర్గ స్థాయి టీడీపీ కార్యకర్తలు, నాయకులు సమావేశం గురువారం నిర్వహించనున్నట్లు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.కాగా గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉంటానని, ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు కలిసి సమస్యలు తెలియజేయవచ్చని తెలిపారు.

నేడు రుణాలకు ఇంటర్వ్యూలు

వీరఘట్టం, మార్చి26(ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలో గురువారం బీసీ, కాపు, బలిజ, కుమ్మ, మేదర, ఈడబ్ల్యుఎస్ వర్గాల వారికి సబ్సిడీ రుణాలకోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో బి.వెంకటరమణ తెలిపారు.

రేపు హుండీల లెక్కింపు

గరుగుబిల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాలకు సంబంధించి హుండీలను శుక్రవారం లెక్కించనున్నట్లు ఈవో వీవీ సూర్య నారాయణ తెలిపారు. దేవస్థానం ప్రాంగ ణంలో దేవదాయ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సేంద్రియ పంటలకు గుర్తింపు

గరుగుబిల్లి, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ విధానాలతో పండించే పంటలకు తగిన గుర్తింపు తీసుకురావడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని సౌత్ ఆసియా రైన్ ఫారెస్ట్ ప్రాజెక్టు మేనేజర్ నీలాకాంత్ తెలిపారు. బుధవారం తోటపల్లి జట్టు కార్యాలయ ఆవరణలో ఏపీ రైతు సాధికార సంస్థ సహకారంతో జట్టు సంస్థ పర్యవేక్షణలో పలు పంటలు నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామిడి, జీడి, పసుపు పంటలకు రైన్ ఫారెస్ట్ అలియన్స్ సర్టిఫికేషన్ చేస్తుందని, ఆ విధానాలను అవగాహన కల్పించేందుకు మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పాఠశాలల సిలబస్ అభివృద్ధి కన్సల్టెంట్ డి.పారినాయుడు, జిల్లాప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ పి.షణ్ముఖరాజు, శ్రీధర్, రోజా చంద్, జట్టు డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్, ప్రాజెక్టు కోఆర్డినేటర్లు ఎం.నూకంనాయుడు, జి.ప్రబోద్ పాల్గొన్నారు.

గడువులోగా సేవలందించాలి: పీవో

పార్వతీపురం రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి):రెవెన్యూశాఖ ద్వారా అందించే అన్ని సేవలు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ అధికారులను ఆదేశించారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే పైలెట్ గ్రామంగా ఎంపికైన గోపాలపురంలో పురోగతిపై పీవో సమీక్షించారు.

కొండచీపుర్లకు టెండరు ఖరారు: పీవో

సీతంపేట రూరల్,మార్చి 26(ఆంధ్రజ్యోతి):సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో బుధవారం జీసీసీకి సంబంధించి ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గిరిజనులు సేకరించిన అటవీ ఉత్పత్తులకు అడ్వాన్స్ టెండర్లు నిర్వహించారు. కొండచీపుర్లను రూ.47కు కొనుగోలు చేసేందుకు టెండర్లుఖరారైనట్లు పీవో యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మిగిలిన పసుపుకొమ్ములు, కుంకుడుకాయలకు ఇంకా టెండర్ ధరలు ఖరారు కాలేదని పీవో పేర్కొన్నారు. కార్యక్రమంలో జీసీసీ డీఎం సంధ్యారాణి, బీఎంలు నర్సింహులు,డి.కృష్ణారావు,సిబ్బంది పాల్గొన్నారు.

సంత వేలంపాట..

సీతంపేటలోని వారపుసంత,రోజు వారి సంత గుత్తహక్కుల కోసం బుధవారం డీఎల్‌పీవో జె.రాంప్రసాద్,సీతంపేట సర్పంచ్ ఆరిక కళావతి ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించారు. బహిరంగ వేలంపాటలో వారపుసంత పాటను హెచ్.సంగమేస్ రూ.7.50 లక్షలకు దక్కించుకోగా, రోజువారి మార్కెట్ పాటను తుండక లక్ష్మయ్యలు రూ.83.5వేలకు దక్కించుకున్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి రామకృష్ణ,పంచాయతీ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

ప్రార్థనలో నీతికథలు బోధించాలి

సాలూరు రూరల్, మార్చి 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రార్థన అసెంబ్లీలో తప్పనిసరిగా రోజు ఒక నీతి కథను బోధించాలని కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ సుల్తానా కోరారు.బుధవారం సాలూరు మండలంలోని పురోహితునివలస ఆదర్శపాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరో తరగతిలో ఎక్కువ మంది నుంచి దరఖాస్తులు వచ్చేలా శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.సురేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.